# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-03-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **హైదరాబాద్‌లో జరగనున్న గ్లోబల్ స్పిరిచ్యువాలిటీ మహోత్సవ్ 2024లో రాష్ట్రపతి ద్రౌపదీముర్ము ఈరోజు పాల్గొంటారు.**

2. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు తెలంగాణలో పర్యటిస్తారు.**

3. **ఎన్నికలతో అనుబంధంమైన ఎలాంటి ప్రక్రియలోనూ గ్రామ, వార్డు వాలంటీర్లు పాల్గొనకుండా చూడాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్. జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు.**

4. **తెలుగుదేశం పార్టీ 34 మంది అభ్యర్థులతో రెండవ జాబితాను ఆంధ్రప్రదేశ్‌లో నిన్న విడుదల చేసింది.**

5. **ప్రపంచ వినియోగదారుల హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని ఈ రోజు జరుపుకుంటున్నాం.**

=========================

హైదరాబాద్‌లో జరగనున్న గ్లోబల్ స్పిరి చ్యువాలిటీ మహెూత్సవ్ 2024 లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ రోజు పాల్గొంటారు. కేంద్ర పర్యాటక శాఖ, శ్రీ రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమా నికి దేశ, విదేశాలకు చెందిన పలువురు ఆధ్యాత్మిక గురువులు, మఠాధిపతులు, పీఠాధిపతులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. దేశంలోని ఆధ్యాత్మిక గురువులతో పాటూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న గురువులందరినీ ఒక వేదిక పైకి తీసుకురావటం ఈ ఉత్సవాల ముఖ్యోద్దేశ్యం. అన్ని మతాల సారాన్ని ఒక చోట చేర్చి విశ్వశాంతి కోసం కృషి చేసేందుకు కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కాన్హా శాంతివనంలో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. కాగా, రేపు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ఇదే కార్యక్రమంలో పాల్గొంటారు.

-------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు తెలంగాణలో పర్యటించనున్నారు. వచ్చే వారం రోజుల్లో రాష్ట్రంలో ఆయన మూడు చోట్ల సభలు రోడ్ షోలు నిర్వహించనున్నారు. ఈరోజు ప్రధానమంత్రి మీర్జాలగూడ నుంచి మల్కాజ్‌గిరి వరకు బీజేపీ నిర్వహించే రోడ్ షోలో పాల్గొంటారు. రేపు నాగర్ కర్నూల్‌లో బహిరంగసభలో ప్రధానమంత్రి ప్రసంగిస్తారు. వచ్చే సోమవారం మరో విడత తెలంగాణలో పర్యటించి, జగిత్యాలలో జరిగే బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ప్రదానమంత్రి పది రోజుల వ్యవధిలో రెండుసార్లు తెలంగాణలో పర్యటిస్తూ ఉండటం ప్రాధాన్యతను సంతరించుకుంది.

-------------------------

ఎన్నికలతో అనుబంధంమైన ఎలాంటి ప్రక్రియలోనూ గ్రామ, వార్డు వాలంటీర్లు పాల్గొనకుండా చూడాలని జిల్లా కలెక్టర్లకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్. జవహర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న దృష్ట్యా వాలంటీర్లను అన్నిరకాల ఎన్నికల విధుల నుంచి తక్షణమే మినహాయించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వాలంటీర్లను ఎన్నికలకు సంబంధించిన ఎలాంటి ప్రక్రియలో పాల్గొన్నా ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఉల్లంఘించినట్లవుతుందని స్పష్టం చేశారు. పోలింగ్ ఏజెంట్లుగా ఉండేందుకు కూడా అర్హులు కారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఇప్పటికే మొదటి జాబితాను విడుదల చేసిన తెలుగుదేశం పార్టీ నిన్న 34 మంది అభ్యర్థులతో రెండవ జాబితాను ఆ పార్టీ విడుదల చేసింది. వీరిలో 27 మంది పురుషులు, ఏడుగురు మహిళలు ఉన్నారు. రానున్న ఎన్నికలకు టిడిపి-జనసేన-బీజేపీ పొత్తులో భాగంగా టిడిపి 144 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయనుండగా... ఇప్పటికే 94 మందితో తొలి జాబితా ప్రకటించింది.

---------------------------

మహిళా శక్తి పథకంలో భాగంగా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ శిల్పారామంలో నైట్‌బజార్‌ను రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళలు ఆర్థిక సాధికారత సాధించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు. 2017 నుంచి నిరుపయోగంగా ఉన్న 119 స్టాళ్లను ఇందుకోసం సిద్ధం చేయాలని మహిళలకు మాత్రమే వీటిని కేటాయించాలని అధికారులకు సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సు, బీఎస్సీ గణితం పూర్తి చేసిన విద్యార్థులు నేరుగా బీటెక్, బీఫార్మసీ కోర్సులో ద్వితీయ సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించే ఏపీ ఈసెట్-2024 దరఖాస్తులు ఈరోజు నుంచి ప్రారంభిస్తున్నట్లు ఏపీ ఈసెట్ ఛైర్మన్, అనంతపురం జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య శ్రీనివాసరావు వెల్లడించారు. జేఎన్‌టీయూలో నిన్న నిర్వహించిన పాత్రికేయల సమావేశంలో ఉపకులపతి మాట్లాడుతూ.. ఈరోజు నుంచి ఏప్రిల్ 15 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. 500 రూపాయలు అపరాధ రుసుంతో ఏప్రిల్ 22 వరకూ, 2 వేల రూపాయలు అపరాధ రుసుంతో 29 వరకూ, 5 వేల రూపాయల అపరాధ రుసుంతో మే 2 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మే 8న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 100 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

---------------------------

ప్రపంచ వినియోగదారుల హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని ఈ రోజు జరుపుకుంటున్నాం. 1962 మార్చి 15వ తేదీన అమెరికా దిగువ సభలో ఆ దేశ అధ్యక్షులు జాన్ ఎఫ్ కెనడీ మొదటిసారిగా వినియోగదారుల హక్కుల బిల్లును ప్రవేశపెట్టారు. కాగా... భారత్‌లో 1989 నుంచి ఈ దినోత్సవాన్ని పాటిస్తున్నాం.

---------------------------

లాజిస్టిక్స్ రవాణా సేవల ద్వారా తెలంగాణ ఆర్టీసీకి 2022-23 ఆర్థిక సంవత్సరంలో 70 కోట్ల ఆదాయం వచ్చినట్లు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎండీ సజ్జనార్ వెల్లడించారు. హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లో మోడల్ లాజిస్టిక్స్ పార్సిల్ కౌంటర్‌తో పాటు కొత్త లోగో, కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ

సందర్భంగా అయన మాట్లాడుతూ రోజూ 15 వేల పార్సిళ్లు టీఎస్ఆర్టీసీ ద్వారా అందిస్తున్నామని..గంటల వ్యవధిలో వాటిని పంపిణి చేస్తున్నామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరుగుతుందని 2023-24లో 120 కోట్లకు పెంచాలనే లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు.

---------------------------

ప్రజల కోరిక మేరకు తెలంగాణ వాహనాల రిజిస్ట్రేషన్ నెంబర్ ప్లేట్లపై పేరును టీఎస్‌ను టీజీగా మారుస్తున్నామని బీసీ సంక్షేమ శాఖా మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఈ రోజు నుంచి వాహనాల రిజిస్ట్రేషన్లు అన్నీ ఇకపై టీజీ అక్షరాలతో వస్తాయని ప్రకటించారు. హైదరాబాద్‌లో నిన్న మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ 'గత .. ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు, మనోభావాలకు విరుద్ధంగా వ్యవహరించిందన్నారు. శాసనసభ ఆమోదంతో టీఎస్‌ను టీజీగా మార్చాలని కేంద్రానికి పంపించామని అందుకు ఆమోదం లభించిందని పేర్కొన్నారు.

---------------------------

గ్రూప్-1 ఉద్యోగ నియామక పరీక్షకు దరఖాస్తుల గడువును తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పొడిగించింది. అభ్యర్థులకు మరో రెండు రోజులపాటు అవకాశం కల్పించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి గత నెల 19న నోటిఫికేషన్ విడుదలవ్వగా.. ఫిబ్రవరి 23 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తోంది. షెడ్యూల్ ప్రకారం నిన్న సాయంత్రం 5గంటలకు గడువు ముగియడంతో.. మరో రెండ్రోజుల పాటు పొడిగిస్తున్నట్టు ప్రకటించింది. బుధవారం వరకు 2.7 లక్షలకు పైగా దరఖాస్తులు అందినట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది.కాగా గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను జూన్ 9న, మెయిన్స్ అక్టోబర్ 21న టీఎస్‌పీఎస్సీ నిర్వహించనుంది.

---------------------------

పదవీ విరమణ చేసిన మాజీ ఐఏఎస్ అధికారులు జ్ఞానేష్ కుమార్, సుఖ్ బీర్ సింగ్ సంధులను కేంద్ర ఎన్నికల కమిషనర్లుగా నియమించారు. ఈ మేరకు కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ ను విడుదల చేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కమిటీ నిన్న ఆమోదం తెలిపింది. ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయల్ రాజీనామా చేయడం, మరో కమిషనర్ అనూప్ చంద్ర పాండే పదవీ విరమణతో ఎన్నికల సంఘంలో ఏర్పడిన రెండు ఖాళీలను కేంద్ర ప్రభుత్వం వీరిద్దరితో భర్తీచేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

---------------------------

అభ్యంతరకర సమాచారాన్ని ప్రసారం చేస్తున్న ఓటీటీలను పలు వెబ్‌సైట్‌లు, యాప్‌లపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ వాటి ప్రసారాల్లో మార్పు రాకపోవడంతో 18 ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు, 19 వెబ్‌సైట్‌లు, 10 యాప్‌లు, 57 సోషల్ మీడియా ఖాతాలను తొలగించినట్లు తెలిపింది. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది.

---------------------------

గ్రామ సచివాలయం వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రజల వద్దకు పాలన తీసుకురావడం జరిగిందని ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం కిమ్మి-బుషింగి గ్రామాల మధ్య నాగావళి నది పై వంతెనను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు కట్టుబడి ఉందన్నారు. 27.50 కోట్ల రూపాయల వ్యయంతో , కిమ్మి వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయడం జరిగిందన్నారు.

======================